జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 30 | జులై | 2025 ◆ పేజీలు : 4

## ఏరియా వైద్యశాలకు వచ్చే రోగుల పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి: భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం, జూలై 29, ప్రజాజ్యోతి:** వర్షాకాలం సందర్భం గా ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు వచ్చే రోగుల పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. మంగళవారం భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను పీవో ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈసమయంలో లేబరేటరీ, ఆపరేషన్ థియేటర్, గర్భిణీ స్త్రీల కాన్పు గది, కంటి ఆపరేషన్ల వార్డు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ గది,

మిగతా 2 లో...









# వృక్ష యజ్ఞం వరల్డ్ రికార్డ్

2 లో..

- 20 వేల మొక్కలు నాటి చరిత్రకు చెక్కిన పేరు
- 'విశ్వగురు వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్న పచ్చపంథా
- చిన్నతనపు అభిరుచిని ఉద్యమంగా మార్చిన ఘనత
- 12 ఏరియాల్లో 56 చోట్ల పచ్చని ఆశ
- జియో ట్యాగింగ్ తో మొక్కల ఎదుగుదలపై నిత్య పర్యవేక్షణ
- కార్మికులు, యూనియన్లు, ప్రజా ప్రతినిధుల నుంచి ప్రశంసల వర్షం
- మంత్రుల ప్రశంసలు – సింగరేణి ఛైర్మన్ ను అభినందించిన రాష్ట్ర నేతలు

పచ్చదనమే శ్వాసగా... భవిష్యత్తు తరాల కోసమే త్యాగంగా! పర్యావరణ పరిరక్షణను స్వప్రయోజనంగా కాకుండా సమాజ ప్రయోజనంగా భావించిన ఒక మనిషి... ఒక ప్రయత్నంతో కాదు, ఏకంగా వృక్షయజ్ఞంతో ప్రపంచ రికార్డు స్థాయిలో అడుగులు వేసాడు. ఇది కేవలం మొక్కలు నాటిన పని కాదు... ఇది భూమికి వెన్నుతట్టి, భవిష్యత్తుకు బతుకు భరోసానిచ్చే ఉద్యమం. స్వంత ధ్యేయానికి కాకుండా, సమాజ మేలుకై జరిపిన ఈ వృక్షయజ్ఞం ఇప్పుడు స్మృతి పద్మంలో ఒక పర్యావరణ ఇంధనగా , వరల్డ్ రికార్డ్ పుస్తకాల్లో చోటు దక్కించుకొనుంది. ఇది ఇండియన్ సివిల్ సర్వెంట్, సింగరేణి సిఎండి అధికారిగా ఉండి ఎన్. బలరాం చేసిన సాధారణ ప్రకృతి ప్రేరిత ఉద్యమం కాదు... అయన నాటిన ప్రతి మొక్క వెనుక ఓ సంకల్పం ఉంది, ప్రతి నేల చిమ్మట వెనుక ఓ సమాజబద్ధమైన ఆత్మీయత ఉంది.ఈ నేపథ్యంలోనే మంగళవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తన పుట్టినరోజు నాడు 225 మొక్కలు నాటి, మొత్తంగా 20 వేల మొక్కలు నాటి ఘనతను సాధించి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుండి సర్టిఫికేట్ అందుకున్నారు.



◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా





- వైభవంగా ముగిసిన సిపిఐ జిల్లా మహాసభలు
- సభల్లో పలు తీర్మానాలకు ఆమోదం — సాబీర్ పాషా

కొత్తగూడెం, జూలై 29 (ప్రజా జ్యోతి): జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ ప్రధాన లక్ష్యమని, అవి పరిష్కారమయ్యే వరకూ నిరంతర పోరాటానికి సిద్ధంగా ఉన్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా స్పష్టం చేశారు. మంగళవారం శేషగిరి భవన్లో విలేకరులతో

మిగతా 2 లో...



## చేతి వృత్తులకు భవిష్యత్తులో విలువ పెరుగుతుంది

### జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో "ఫర్నిచర్ ప్రొడక్షన్ అసిస్టెంట్" శిక్షణకు మొదటి బ్యాచ్ ఎంపిక పూర్తి

**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 29, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యువత చేతివృత్తుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం పాల్వంచలోని ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన "ఫర్నిచర్ ప్రొడక్షన్ అసిస్టెంట్" కోర్సుపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "కంప్యూటర్ ప్రోగ్రామ్ చేయగలదు కానీ ఫర్నిచర్ తయారు చేయలేదని ,ఈ వృత్తుల్లో స్థిరత, ఆదాయం రెండూ ఉంటాయన్నారు , ఈ శిక్షణ పూర్తి అయిన అనంతరం నెలకు రూ.15,000 నుండి రూ.30,000 వరకు పారితోషికంతో ఉద్యోగ అవకాశాలు ఉండగా, కొందరికి రూ.1 లక్ష వరకు వేతనాలు అందే అవకాశముందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని యువత వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని

మిగతా 2 లో...

## చేతి వృత్తులకు భవిష్యత్తులో విలువ పెరుగుతుంది



(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎన్ ఎస్ టి ఐ, ఎఫ్ ఎఫ్ ఎస్ సి హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని, ఫర్నిచర్ అండ్ ఫిటింగ్స్ స్కిల్ కౌన్సిల్ ఎఫ్ ఎఫ్ ఎస్ సి రీజనల్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పీ. ఆధ్వర్యంలో శిక్షణ అవకాశాల గురించి సమగ్రంగా వివరించారు. డ్రాయింగ్ ,టెస్ట్ ద్వారా ఎంపిక – మొదటి బ్యాచ్ కు శుభారంభం ... ఈ కార్యక్రమంలో నిర్వహించిన డ్రాయింగ్ ,టెస్ట్ ద్వారా మొదటి బ్యాచ్ గా 10 మంది గిరిజన యువత ఎంపికయ్యారని, వారు ఎన్ ఎస్ టి ఐ హైదరాబాద్ లో మూడు నెలల పాటు శిక్షణ పొందనున్నార నీ, ఎంపికైన అభ్యర్థుల వివరాలు: 1. డి. రామ్ చరణ్ (బెండలపాడు), 2. కె. జంపన్న బాబు (బొజ్జిగుప్ప రామచంద్రుని పేట), 3. కె. వెంకటేష్ (బెండలపాడు), 4. కె. అఖిల్ (ఇల్లం దులపాడు తండా), 5. డి. అర్జున్ రావు (వడ్డే రంగాపురం), 6. బి. రాజు (మణుగూరు), 7. బి. విష్ణువర్ధన్ (రామవరం), 8. కె. ప్రసాద్ (రామచంద్రుని పేట), 9. కె. రామకృష్ణ (బొజ్జిగుప్ప), 10. ఎస్. వీరేంద్ర గోపాలస్వామి (బెండలపాడు). ప్రతి అభ్యర్థికి జిల్లా యంత్రాంగం ద్వారా రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.5,000 చొప్పున అందించనున్నా మన్నారు, సి ఎస్ ఆర్ ద్వారా వసతి, భోజనం – అభిమన్య ఇంటీరియో డొనేషన్ అభిమన్య ఇంటీరియో ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దిలీప్ వర్మ , ఎంపికైన అభ్యర్థుల కోసం హైదరాబాద్ లో మూడు నెలల పాటు వసతి , భోజన ఖర్చుల నిమిత్తం రూ.1,12,200 విలువైన చెక్కును కలెక్టర్ కు అందజేశారు. ఈ సాయం సి ఎస్ ఆర్ పథకం ద్వారా చేయబడిందన్నారు, ఈ సందర్భంగా కలెక్టర్ దిలీప్ వర్మ ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎఫ్ ఎఫ్ ఎస్ సి రీజనల్ స్కిల్ చాప్టర్స్ సౌత్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పీ. మాట్లాడుతూ, ఫర్నిచర్ రంగంలో పాన్ ఇండియా స్థాయిలో నెలకు రూ.1 లక్ష వరకు సంపాదించే అవకాశాలు ఉన్నాయన్నారు, తెలిపారు. నేడు ఎన్నికైన అభ్యర్థులకు ఆగస్టు 4 తారీకు నుండి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు ఈ కార్యక్రమంలో స్కిల్ అకాడమీ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ చారి, మెప్మా పిడి రాజేష్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా కార్పెంటర్ల సంఘం అధ్యక్షుడు రాముడు రామాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా వైద్యశాలకు వచ్చే రోగుల పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

(మొదటి పేజీ తరువాయి...)



రికార్డులను పరిశీలించారు. గిరిజనులకు అందిస్తున్న వైద్య సౌకర్యాల గురించి ఆసుపత్రి పర్యవేక్షకులు రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ మారుమూల ప్రాంత ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి వివిధ రకాల జబ్బులకు వైద్యం చేయించుకోవడానికి గిరిజనులు వస్తూ ఉంటారని వారికి సరైన వైద్యం చేసి మందులు అందజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలు ఇబ్బంది పడకుండా గ్రామాల నుంచి అంబులెన్సులో తీసుకొని రావాలని డెలివరీ అయ్యే వరకు పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉన్నది లేనిది పరిశీలించి తల్లితో పాటు బిడ్డ కూడా సక్రమంగా వైద్య చికిత్సలు చేయాలని అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీ పక్కన గల గిరిజన మహిళ ఆరోగ్య కార్యకర్తల శిక్షణ కేంద్రాన్ని సందర్శించి శిక్షణ తీసుకుంటున్న మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ముఖ్యంగా కరెంటు మంచినీరు, టాయిలెట్లు, డోర్లు వారికి సౌకర్యంలా ఉండేలా మరమ్మతులు చేయించాలని ఇంజనీరింగు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం సైదులు, ఏటీడీవో అశోక్ కుమార్, ఈఈ హరీష్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ టీవీ శ్రీనివాస్, హెచ్ఐవోలు కృష్ణయ్య, లింగానాయక్ పాల్గొన్నారు.

# వృక్ష యజ్ఞంతో వరల్డ్ రికార్డు..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 29, ప్రజాజ్యోతి:** పచ్చదనమే శ్వాసగా... భవిష్యత్తు తరాల కోసమే త్యాగంగా! పర్యావరణ పరిరక్షణను స్వప్రయోజనంగా కాకుండా సమాజ ప్రయోజనంగా భావించిన ఒక మనిషి... ఒక ప్రయత్నంతో కాదు, ఏకంగా వృక్షయజ్ఞంతో ప్రపంచ రికార్డు స్థాయిలో అడుగులు వేసాడు. ఇది కేవలం మొక్కలు నాటిన పని కాదు... ఇది భూమికి వెన్నుతట్టి, భవిష్యత్తుకు బతుకు భరోసానిచ్చే ఉద్యమం. స్వంత ధ్యేయానికి కాకుండా, సమాజ మేలుకై జరిపిన ఈ వృక్షయజ్ఞం ఇప్పుడు స్మృతి పద్యంలో ఒక పర్యావరణ ఇంధనగా , వరల్డ్ రికార్డ్ పుస్తకాల్లో చోటు దక్కించుకొనుంది. ఇది ఇండియన్ సివిల్ సర్వెంట్, సింగరేణి సిఎండి అధికారిగా ఉండి ఎన్. బలరాం చేసిన సాధారణ ప్రకృతి ప్రేరిత ఉద్యమం కాదు... అయన నాటిన ప్రతి మొక్క వెనుక ఓ సంకల్పం ఉంది, ప్రతి నేల చిమ్మట వెనుక ఓ సమాజబద్ధమైన ఆత్మీయత ఉంది.ఈ నేపథ్యంలోనే మంగళవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తన పుట్టినరోజు నాడు 225 మొక్కలు నాటి, మొత్తంగా 20 వేల మొక్కలు నాటి ఘనతను సాధించి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుండి సర్టిఫికేట్ అందుకున్నారు.



### ఒక వ్యక్తి.. ఒక ఆశయం..

మహబూబ్ నగర్ జిల్లాలో ఒక మారుమూల తిరుమల గిరి గ్రామంలో జన్మించి, చిన్నతనం నుంచి పేదరికంలో అనేక కష్టాలను ఎదుర్కొని పై స్థాయికి ఎదిగిన ఎన్.బలరామ్ పర్యావరణ పట్ల తనకు గల అభిమానంతో మొక్కలు నాటడాన్ని ఒక ఇష్టమైన కార్యక్రమంగా చేపట్టారు. 2019 జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా 108 మొక్కలను కొత్తగూడెం బంగ్లోస్ ఏరియాలో నాటి తన వృక్షమహా యజ్ఞాన్నిఅక్కడి నుండి ప్రారంభించారు. అనంతరం సింగరేణిలోని మొత్తం 12 ఏరియాల్లో 56 ప్రదేశాలలో ఆయన విస్తృతంగా మొక్కలు నాటారు. సంస్థలో ఉన్నతాధికారిగా ఉంటూ, తన విధులలో తలమునకలై ఉన్నప్పటికీ పర్యావరణ పట్ల ప్రేమతో ఆయన మొక్కలు నాటడానికి సమయాన్ని కేటాయిస్తూ ప్రతి పర్యావరణ దినోత్సవం, పండుగలు, ముఖ్యమైన దినాలలో మొక్కలు నాటడం ప్రవృత్తి గా మార్చుకున్నారు . ప్రతి చోటా కనీసం 50 మొక్కలు నుండి గరిష్టంగా 1,250 మొక్కలను తాను ఒక్కడే ఏక దిగన నాటి పర్యావరణం పట్ల తనకున్న సంకల్పవు ఆశయాన్ని భూదేవి సాక్షిగా నిరూపించారు.

### సందేశాలతో కాదు .. ఆచరణలతో

సాధారణంగా ఉన్నత స్థాయి అధికారులు మూడు నాలుగు మొక్కలు నాటి అనంతరం సందేశాలు ఇచ్చి వెళ్లిపోవడం మనం గమనిస్తాం. కానీ ఎన్.బలరామ్ ఒక్కరే 20 వేల మొక్కలు నాటి సందేశాలను ఆచరణలో పెట్టారు. రామగుండం–3 ఏరియాలోని ఓపెన్ కాస్ట్ బర్డన్ డంపు పై 2019 సెప్టెంబర్ 15 న కురుస్తున్న వర్షం సాక్షిగా 1,251 మొక్కలను తాను ఒక్కడే నాటి రికార్డు సృష్టించారు. అలాగే శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని బర్డన్ డంపు పై 1,237 మొక్కలను నాటి హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శ్రీరాంపూర్ గీతా మందిర్ సమీపంలో 1,006 మొక్కలు, భూపాలపల్లిలో ఓల్డ్ నర్సరీ వద్ద 600 మొక్కలు, థౌసండ్ క్వార్టర్స్




ఎదురుగా 626 మొక్కలు, మణుగూరు ఓపెన్ కాస్ట్ కు సమీపంలో 440 మొక్కలు ఇలా ప్రతి ఏరియాలో మొక్కలు నాటి వనాలను సృష్టించారు. ఆయన నాడు నాటిన మొక్కలు నేడు చిన్నపాటి అడవులుగా పెరుగుతూ పశుపక్షాదులు ఆకర్షిస్తున్నాయి. తన స్వగ్రామమైన తిరుమలగిరిలో కూడా 416 మొక్కల్ని ఆయన నాటారు. ఆదిలాబాద్ దుర్గ కాలనీలో, న్యూఢిల్లీలోని ఒక పార్కులో, ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ వద్ద, ఆస్ట్రేలియాలో ఇంకా ఇతర ప్రాంతాల్లో కూడా ఆయన మొక్కలు నాటడం జరిగింది.

### సాంకేతికతతో పర్యవేక్షణ..

ఎన్.బలరామ్ తాను నాటిన ప్రతి మొక్కను సాంకేతికతతో పర్యవేక్షణకు శ్రీకారం చుట్టారు. అతను నాటిన 40కి పైగా ప్రదేశాలకు జియో ట్యాగింగ్ చేసి, మొక్కల పెరుగుదల పై దృష్టి పెట్టడం మరో గొప్ప విశేషం. కేవలం మొక్కలు నాటి వదిలివేయడం కాకుండా తాను మొక్కలు నాటిన ప్రదేశాలను జియో జియో ట్యాగింగ్ చేయడం ద్వారా నిత్యం ఆ మొక్కలు ఏ విధంగా పెరుగుతున్నాయి అనేది బలరామ్ నిత్యం పర్యవేక్షిస్తుంటారు. చనిపోయిన మొక్కలు స్థానంలో కొత్త వాటిని నాటడం వల్ల ఆయన ఇప్పటి వరకు నాటిన మొక్కలు 90% పాదుకొని నేడు వృక్షాలుగా ఎదుగుతున్నాయి. చిన్నతనంలో మొక్కలతో పెంచుకున్న అనురాగాన్ని, సింగరేణి పదవిలోకి వచ్చిన తరువాత ఉద్యమంగా మార్చారు. ఇది కేవలం అధికారిక బాధ్యత కాదు... వ్యక్తిగత నిబద్ధత. "మొక్కలు నాటడం నా ఆనందం, ఆత్మసంతృప్తి" అని చెబుతారు ఆయన.

### 20 వేల మైలురాయి – మట్టి మీద ముద్రలా

రామగుండం నుంచి శ్రీరాంపూర్ వరకు, తన స్వగ్రామం తిరుమలగిరి నుంచి ఆస్ట్రేలియా వరకు ఆయన నాటిన మొక్కల జాడ కనిపిస్తుంది. మొక్కలు అడవులుగా మారటం, పశుపక్షుల ఆశ్రయంగా మారటం ఇది కేవలం గ్రీన్ కవర్ కాదు, జీవన వైవిధ్యానికి ఓ కొత్త తెర. కార్మికులు, అధికారులు, ప్రతినిధులు – ప్రతి ఒక్కరిలోని పర్యావరణ గౌరవాన్ని సామాజిక స్థాయిలో ఈ పర్యావరణ ప్రభావాన్ని నిద్రలేపిన వ్యక్తిగా బలరం ను పలువురు సూచిస్తున్నారు. కొమటిరెడ్డి, కొండా సురేఖ, సీతక్క లాంటి నేతలు కూడా ఆయనను అభినందించటం రాజకీయపక్షాలు పక్కన పెట్టి పర్యావరణం కోసం ఏకమయ్యే సందర్భానికి నిదర్శనంగా ఇది నిలుస్తోంది. తన మొక్కలు నాటే కార్యక్రమాన్ని 20వేల వద్ద ముగించడం లేదని ఇకపై కూడా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగిస్తూనే ఉంటానని, ప్రతి ఒక్కరూ ఇదే తరహాలో మొక్కలు నాటుతూ పర్యావరణ పెంపుదలకు కృషి చేయాలని ఎన్. బలరామ్ పిలుపునిచ్చారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

(మొదటి పేజీ తరువాయి...)

మాట్లాడిన ఆయన, ఈ నెల 26, 27 తేదీల్లో అశ్వారావుపేటలో జిల్లా 3వ మహాసభలు ఘనంగా జరిగినట్లు తెలిపారు. ఈ మహాసభల్లో 30 మందితో జిల్లా కార్యవర్గం, 79 మందితో కౌన్సిల్ ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సభలకు ముందే జిల్లావ్యాప్తంగా 713 గ్రామశాఖల మహాసభలు నిర్వహించామని, ప్రస్తుతం సిపిఐలో 13,474 మంది శాశ్వత ప్రాథమిక సభ్యులు ఉన్నట్లు చెప్పారు. జాతీయ స్థాయి మార్గదర్శకాల మేరకు కమిటీల్లో యువతకు 10 శాతం, మహిళలకు 10 శాతం ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. మహాసభ తీర్మానాల్లో కీలక అంశాలు.. మహాసభలలో మొత్తం 49 తీర్మానాలు ఆమోదం పొందినట్లు సాబీర్ పాషా వివరించారు. ముఖ్యంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు ప్రతి ఎకరాకు అందేలా చర్యలు, కొత్తగూడెం, ఇల్లెందుల్లో ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల ప్రారంభం, జిల్లా కేంద్రాల్లో కళాక్షేత్రాల ఏర్పాటు, నూతన విద్యా విధాన ఉపసంహరణ, విద్యారంగానికి బడ్జెట్ లో తగిన నిధుల కేటాయింపు, విద్యాహక్కు చట్టానికి న్యాయబద్ధ అమలు, ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయితీలను తిరిగి తెలంగాణలో కలపాలి, పేదల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి, ఉపాధిహామీ పథకంలో 200 రోజులు, రోజుకు రూ.600 చెల్లింపు, జర్నలిస్టులకు, లాయర్లకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం, స్వామినాథన్ సిఫార్సుల మేరకు రైతులకు మద్దతు ధర, అర్హులందరికీ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉద్యమ కారులకు గృహభద్రత, జిల్లాలో పెండింగ్ లో ఉన్న నీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, భద్రాచలం గోదావరి కరకట్ట నిర్మాణానికి వేగం పెంచాలి,

### ప్రభుత్వ హామీలను నిలబెట్టాలి..

ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రజల కష్టాలను అణచివేయలేమని ఆయన హెచ్చరించారు. అవసరమైతే తిరిగి ఉద్యమ బాటపట్టేందుకు సిపిఐ వెనకడుగు వేయదని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బలంగా పాల్గొనాలన్న పిలుపు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీకి ఉన్న బలమైన కేంద్రాల్లో తిరిగి విజయం సాధించాలని, రాష్ట్ర కమిటీ నిర్ణయాలతో ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్కే సలీం, మున్నా లక్ష్మీ కుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, భూక్య దస్రు, వాసిరెడ్డి మురళీ, కంచర్ల జమలయ్య, అడుసుమిల్లి సాయిబాబు, మువ్వా వెంకటేశ్వరరావు, కందుల భాస్కర్, బి. వీరస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్ కె ఫహీమ్, అడ్డగర్ల తాతాజీ, కౌన్సిల్ సభ్యులు భూక్య శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వీ హబ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్ హెచ్ జి, మహిళా పారిశ్రామికవేత్తలకు ర్యాంప్ ఉమెన్ అక్సెలేరేషన్ ప్రోగ్రాం పై అవగాహన




**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 29, ప్రజా జ్యోతి:** వి హబ్ ఉమెన్ ఎంటర్ ప్రేనర్స్ హబ్ మినిస్ట్రీ ఆఫ్ ఐ టి ఈ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ డిఆర్డిఏ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్ హెచ్ జి మహిళలు , మహిళా పరిశ్రామికవేత్తలకు ర్యాంప్ (రైసింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎం ఎస్ ఎం ఈ పెర్ఫార్మెన్స్ స్కీమ్) ప్రోగ్రాం పై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా వరల్డ్ బ్యాంక్ , కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎం ఎస్ ఎం ఈ నిధులతో చేపడుతున్న ఈ ప్రోగ్రాం ద్వారా మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారాలు / ఎం ఎస్ ఎం ఈ లకు బిజినెస్ యక్షలరేషన్ సపోర్ట్ అంద నుందని రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ ప్రోగ్రాం లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన మహిళా పరి శ్రామికవేత్తలకు తమ బిజినెస్ అభివృద్ధిని వేగవంతం చేసుకొని తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుంది అని వీ హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ తెలిపారు. దీనిలో భాగంగా టెక్స్టైల్స్, ఫుడ్ మాన్యుఫాక్చరింగ్, ,హస్తకళలు వంటి రంగాల్లోని వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ, ప్రొడక్ట్ డెవలప్మెంట్ , డైవర్సిఫికేషన్, బ్రాండింగ్ , మార్కెట్ యాక్సెస్, క్రెడిట్ లింకేజ్, ఎక్స్పర్ట్ మెంటరింగ్ మద్దతు అందనుంది అని వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ తెలిపారు. కాగా నిర్వహించిన ఈ బూట్క్యాంప్ లో ఈ ప్రోగ్రాం పైన అవగాహన కల్పించి వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.డీ.ఓ విద్యాచందన, డీ. పి.ఎం అనురాధ , వీ హబ్ సభ్యులు పాల్గొన్నారు..

## మణుగూరు,అశ్వరావుపేట ఆసుపత్రులలో రేపటి నుండి అందుబాటు లోకి రానున్న రక్త నిల్వ కేంద్రాలు

- నేడు ఆయా ఆసుపత్రులకి అందిన అనుమతి పత్రాలు
- రక్తం కోసం దూరప్రాంతాలకు వెళ్ళే దుస్థితి నుండి విముక్తి
- స్థానిక శానసభ్యుల సూచన మేరకు ప్రత్యేక కృషి చేసిన
- జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్
- డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవిబాబు
- జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమన్వయం తో అనుమతులను

**సాధించిన వైద్య సిబ్బంది**

**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 29, ప్రజా జ్యోతి:** జిల్లాలో కేవలం కొత్తగూడెం భద్రాచలం లో మాత్రమే రక్త నిధి కేంద్రాలు ఉండగా రేపటినుండి నూతనంగా అశ్వారావుపేట ,మణుగూర్ ఏరియా ఆసుపత్రులలో సైతం రక్త నిల్వ కేంద్రాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. వాటికి సంబంధించిన లైసెన్స్ కూడా ఆయా ఆసుపత్రులకు లభించాయి ,అతి త్వరలో ఇల్లందు లో సైతం రక్త నిల్వ కేంద్రం సేవలు రానున్నాయి, ప్రస్తుతం గర్భిణి స్త్రీలు, సికిల్ సెల్ అనేమియా,తలసేమియా, ఇతర రక్త హీనత తో ప్రతి నెల రక్తం ఎక్కించుకోవాల్సిన వారికి,రోడ్డు ప్రమాదాలు వంటి సందర్భం లో రక్తం కోసం మణుగూరు, అశ్వరావుపేట ఇల్లందు నుండి సమీపంలో కొత్తగూడెం , భద్రాచలం ,సత్తుపల్లి లేదా పాల్వంచ వెళ్లాల్సి ఉండేది , కానీ రేపటినుండి అశ్వారావుపేట, మణుగూరు ఏరియా ఆసుపత్రుల లోనే రక్తం అందుబాటులో రానుంది , దీని ద్వారా ఎమర్జెన్సీ సమయంలో తక్షణ చికిత్స అందనుంది, గోల్డెన్ హవర్ లో చికిత్స ఇచ్చి ప్రాణాలు కాపాడే అవకాశం కలిగింది, 2023 లో మంజూరైన ఇల్లందు ,మణుగురు,అశ్వరావుపేట ఆసుపత్రుల రక్త నిల్వ కేంద్రాలు కొన్ని సాంకేతిక సమస్యలు వల్ల ప్రారంభానికి నోచుకో లేకపోయినా ఈ సమస్యని స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రత్యేక చొరవ చూపి డ్రగ్ ఇన్స్పెక్టర్ కి ఆదేశాలివ్వగా మంగళవారం అనుమతి పత్రాలు మంజూరు అయ్యాయి.

## సీఎండీ బలరాం జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం

- సింగరేణి హెడ్ ఆఫీస్ లో 300 మందికిపైగా అన్నదానం



**కొత్తగూడెం, జూలై 29 (ప్రజా జ్యోతి):** సింగరేణి సీఎండీ ఎన్. బలరాం జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం హెడ్ ఆఫీస్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే షబీర్ పాష, సింగరేణి ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు పాల్గొని కేక్ కట్ చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దాదాపు 400 మంది బాలికలు, కాంట్రాక్టు కార్మికులు, పేదలకు అన్నదానం చేశారు.సీఎండీ బలరాం పనితీరును కొనియాడుతూ, కార్మికులకు ఆయన చేస్తున్న సేవలు ప్రశంసలందుకున్నాయి. ఈ సందర్భంగా జీఎం (సివిల్) ధనసరి వెంకటేశ్వర్లు, జీఎం (ఈ అండ్ ఎం) తిరుమల రావు, ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధి అంగోతు భాస్కర్ రావు, జిమ్మిడి మల్లేశ్, బందెల విజేందర్, పొన్నగంటి అంకుసు (చిన్ని), మధుసూదన్ రావు, మైల రాజేశ్వరరావు, ఊట్ల గణేష్, మనీస్ విక్టర్, మొగిలిపాక రవి కుమార్, చెరుపల్లి నాగరాజు, ఉర్సు శివ దర్శనం, బీసీ నేత సుమన్, సేవా సమితి ప్రతినిధి ముని తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే




**టేకులపల్లి,జూలై29,ప్రజాజ్యోతి:** మండలంలోని గొల్లపల్లి గ్రామంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే లో భాగంగా ఆరోగ్యపకేంద్రాన్ని స్టేట్ సర్వే టీంసభ్యులు స్వచ్ఛభారత్ మిషన్ ప్రత్యేక అధికారి రవీందర్ రావు, ఎంపీడీవో మల్లీశ్వరి లు సందర్శించారు.ఈ సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్రం చుట్టూతా పరిశుభ్రత,పచ్చదనం,మెడికల్ వ్యర్థాలను పద్ధతిగా క్రిమిరహితం చేస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామంలో గృహాలను,అంగన్వాడి సెంటర్, ప్రభుత్వ పాఠశాలను పంచాయతీ ఆఫీసులను సందర్శించి మరుగుదొడ్ల వినియోగం ఇంకుడు గుంతలు తడి చెత్త పొడి చెత్త పద్ధతిగా వేరు చేయు విధానం తదితర అంశాలను పరిశీలించి ప్రజలకు అధికారులకు తగు సూచనలు సలహాలును తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గణేష్ గాంధీ ,కార్యదర్శిచిట్టెమ్మ, శ్వేత,పవిత్ర,మండల వైద్యాధికారులు కందుల దినేష్,కంచర్ల వెంకటేశ్వర్లు,ఆరోగ్య విస్తరణ అధికారి దేవా,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు హారిక, వైద్య సిబ్బంది కమల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## సివిక్ మెయింటెనెన్స్ టెండర్ ను వెంటనే పిలవాలని కేఓసి మేనేజర్ కు వినతిపత్రం

- నెల రోజులుగా పని లేని భూనిర్వాస్తులు
- పిట్ సెక్రెటరీ బాలాజీ, షేక్ యాకుబ్ షావలి రాష్ట్ర అధ్యక్షులు




**టేకులపల్లి,జూలై29,ప్రజాజ్యోతి:** టేకులపల్లి కె ఓ సి లోని సివిక్ మెయింటెనెన్స్ టెండర్ జూన్ 1న అయిపోయిందని సింగరేణి అధికారుల జాప్యం వల్ల భూనిర్వాసితులైన కార్మికులకు ఉపాధి లేకుండ పోయిందని మంగళవారం కెఓసి మేనేజర్,కు వినతి పత్రం అందజేశారు.కెఓసి ఐఎన్టియుసి,పిట్ సెక్రెటరీ బాలాజీ ,షేక్ యాకూబ్ షావలి, రాష్ట్ర అధ్యక్షులు ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) మేనేజర్ కు వివరిస్తూ కాంట్రాక్టు కార్మికుల ఎడల అధికారులు నిర్లక్ష్యం విడాలని వెంటనే కార్మికులకు పాత టెండర్ మ్యాన్ పవర్ తగ్గించకుండా పిలవాలని వారు మేనేజర్ కు విజ్ఞప్తి చేశారు.మేనేజర్ మాట్లాడుతూ డీజీఎం సివిల్ రవికుమార్ తో మాట్లాడానని టెండర్ వచ్చేందుకు కృషి చేస్తామని వారన్నారు. అనంతరం కార్మికులతో యాకుబ్ షావలి మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండి టెండర్ సాధించుకునే విధంగా పోరాడాలని వారికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రామ్ కుమార్,వెంకటేష్ అవినాష్,వెంకట నర్సు, మంగ్యా,జి,బాలు,గణేష్,శివ, సాయికుమార్,నరేష్,చొప్పరి శీను,చిన్న శీను పాల్గొన్నారు .

## మద్యం షాపుల నిర్వహణ కై గ్రామసభలు



**టేకులపల్లి,జూలై 29, ప్రజాజ్యోతి:** టేకులపల్లి, దాస్ తండా గ్రామపంచాయతీల్లో మద్యం షాపుల ఏర్పాటుకు పీసా గ్రామ సభలు ఆమోదం తెలిపాయి. 2025-2027 ఎక్సైజ్ సంవత్సరానికి గిరిజన ప్రాంతాల మద్యం షాపుల నియంత్రిత అనుమతుల కోసం జిల్లాకు ఇచ్చిన మార్గ దర్శకుల ప్రకారం ఈ గ్రామ సభలు జరిగాయి. గిరిజనుల అభిప్రాయాన్ని అనుసరించి షాపులు ఏర్పాటు చేయాలన్న నిబంధనలతో ఆయా పంచాయతీ కేంద్రాల్లో పీసా గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేశారు. ప్రత్యేక అధికారి ఎన్. అన్నపూర్ణ ,పీసా అధ్యక్ష,కార్యదర్శుల సమక్షంలో పీసా గ్రామ సభ విజయవంతంగా పూర్తి అయినట్లు టేకులపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి, దాస్ తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓర్సు గోపాలకృష్ణ, పీసా ఉపాధ్యక్షులు, మొబిలైజర్లు, గిరిజనులు ఓటర్లు ఈ సభలలో ఉన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన శివయ్య

**ఇల్లందు, జులై 29, ప్రజాజ్యోతి:** నియోజకవర్గంలోని కామేపల్లి మండలానికి చెందిన సీనియర్ టిడిపి నాయకుడు తోటకూరి శివయ్య మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు ల ఆధ్వర్యంలో హైదరాబాద్ లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గాడ్ ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. ముందుగా ఎమ్మెల్యే కోరం కనకయ్య రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గాడ్ లకు శాలువా, పూల బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి సొసైటీ వైస్ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఫతే మహమ్మద్, ఏపూరి మహేందర్ పాల్గొన్నారు.



## శిశు గృహను సందర్శించిన న్యాయమూర్తి భవాని


**భద్రాచలం, జూలై 29,ప్రజాజ్యోతి:** భద్రాచలంలోని శిశు గృహను భద్రాచలం ఇన్చార్జి ప్రధమశ్రేణి న్యాయమూర్తి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఇలాంటి సెంటర్లను ఏర్పాటు చేసినందుకు పాలు తాగే చిన్న పిల్లలకు ఎంతో అదృష్టమని కొనియాడారు. ఈ సందర్భంగా కారా సెంటర్లో ఉన్న ఒక బాబుకి పుట్టిన రోజు సందర్భంగా న్యాయమూర్తి కేక్ కట్ చేయిస్తూ ఆ బాలునికి విద్యాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో కారా సెంటర్ మేనేజరు చిట్టిబాబు, సీడీఓఎస్ అంగన్ వాడీ సభ్యులు, సీనియర్ న్యాయవాది పేరాల నాగరాజు పాల్గొన్నారు.

## అంజన్నకు అభిషేకం... రామయ్యకు కల్యాణం



**భద్రాచలం కల్చరల్ , జూలై 29, ప్రజాజ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం దాసాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తమలపాకులతో ఆర్జిత సేవ నిర్వహించారు. అదేవిధంగా నిత్యకల్యాణ మండపంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యహావచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు.

## రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా ఎంపిక పట్ల బార్ అసోసియేషన్ హర్షం



**భద్రాచలం,జూలై 29,ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర న్యాయమూర్తుల సంఘు కార్యనిర్వాహక సభ్యులుగా భద్రాచలం జ్యూడిషియల్ ప్రధమ శ్రేణి న్యాయమూర్తి వి శివ నాయక్ ఎన్నికపట్ల భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం హర్షం వ్యక్తం చేశారు.అనంతరం అయన మాట్లాడుతూ న్యాయమూర్తి శివ నాయక్ మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

## 04 లీటర్ల నాటుసారా పట్టివేత..

- హీరో హెచ్ఎఫ్ డీలక్స్ బైక్ స్వాధీనం..
- ఒకరి అరెస్ట్




**టేకులపల్లి,జూలై29,ప్రజాజ్యోతి:** కొత్తగూడెం జిల్లాఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిటిఎఫ్ ఎస్సై గౌతమ్ ఆధ్వర్యంలో మంగళవారం టేకులపల్లి మండలంలోని బోడు రోడ్డు లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా హీరో హెచ్ఎఫ్ డీలక్స్ బైక్ పై అనుమానం వచ్చి క్షుణ్ణంగా పరిశీలించగా తన సంచిలో ఉన్న రెండు లీటర్ల థమ్సప్ బాటిళ్లలో 04 లీటర్ల గుడుంబా ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నారు.పట్టుకున్న నాటుసారా, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి రాజారాంతండ కు చెందిన జరుపుల శంకర్ పై కేసు నమోదు చేసి రిమాండ్కు పంపించినట్లు ఎస్ఐ గౌతమ్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది రామకృష్ణగౌడ్, హాబీబ్ పాషా, సుమంత్, శ్రావణి, రమేష్ పాల్గొన్నారు.

# వివక్ష చూపితే.. పోరాటం తప్పదు

- ఎస్టీ లిస్టు నుంచి తొలగింపుల ప్రయత్నాన్ని ఖండించిన బంజారా నాయకులు
- అన్నదమ్ములుగా ఉండే తెగలపై చిచ్చుపెట్టే భద్రాచలం ఎమ్మెల్యేకు శాసన సభ్యత్వం అవసరమా?
- సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోత్ హుస్సేన్ నాయక్ విమర్శలు
- వివక్ష చూపితే.. పోరాటం తప్పదని హెచ్చరించిన సేవలాల్ సేన




**కలెక్టరేట్, కొత్తగూడెం, జూలై 29 (ప్రజా జ్యోతి):** పరస్పర సోదరత్వంతో జీవించే గిరిజన తెగల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలనే కుట్రలో భాగంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వ్యవహరిస్తున్నారని, ఆయన శాసనసభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ హుస్సేన్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పాల్వంచ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. “లంబాడీ, బంజారా, సుగాలీ తెగల పట్ల ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వ్యవహారం వ్యక్తిగతమా? లేక కాంగ్రెస్ పార్టీ అధికారిక ప్రమేయమ ? అని దీనిపై కాంగ్రెస్ అధిష్టానం తక్షణమే స్పష్టత ఇవ్వాలి,” అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వెంకట్రావు, గిరిజనుల మధ్య ఫిరాయింపులను రెచ్చగొడుతూ మత, కుల వివక్షతకు ప్రోత్సాహం ఇస్తున్నారని హుస్సేన్ నాయక్ విమర్శించారు. కాంగ్రెస్లోకి మారినప్పటి నుంచే వైఖరి తెల్లం వైకరి మారిందని అన్నారు. చట్ట విరుద్ధంగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం ఆపకపోతే, భవిష్యత్తులో ఆ దుష్ఫలితాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. లంబాడీల ఓట్లతో గెలిచి, ఇప్పుడు వారినే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ తెల్లం వెంకట్రావు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయడం ఓ ఆత్మవంచనగ చర్యగా అతను అభివర్ణించారు. తమ జాతుల వోట్లతోనే గెలిచి...వోటర్లకే అన్యాయం చెయ్యడం తెల్లం అనైతిక చర్యలకు నిదర్శనమని అన్నారు. దమ్ముంటే తెల్లం వెంకట్రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బహిరంగంగా పోటీ చేయాలి అని సవాల్ విసిరారు. వెంకట్రావు జిల్లామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రధాన అనుచరుడిగా పనిచేస్తూ, వారి ఆశీస్సులతోనే లంబాడీలపై వ్యతిరేక కార్యక్రమాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు.

### సామాజిక న్యాయాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదా..?

రాష్ట్రంలో గిరిజనులలో 70% లంబాడీలు ఉన్నా – వారికి కేవలం ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ మాత్రమే ఉన్నారని, 30% జనాభా కలిగిన వర్గానికి ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నారంటే అసమానత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మంత్రి పదవుల్లోనూ లంబాడీలకు అన్యాయం జరుగుతోందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు లక్షల లంబాడీ జనాభా ఉన్నా వారికి ఒక్క ఎమ్మెల్యే కూడా లేరని, అదే జిల్లాలో రెండు లక్షల వారి వర్గానికి నాలుగు ఎమ్మెల్యేలుంటే ఇది ఏ న్యాయం అని ప్రశ్నించారు. కొత్తగూడెం నియోజకవర్గంలో 80,000 మంది లంబాడీలు ఉన్నా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి వారికి అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ఇది కొంతమంది మంత్రుల కుట్రలో భాగమేనని, వారికి త్వరలో లంబాడీలు బుద్ధి చెప్పనున్నట్టు హెచ్చరించారు. పాలేరు నియోజకవర్గంలో లంబాడీలు అధికంగా ఉండటంతో శ్రీనివాస్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించామని, అయితే కాంగ్రెస్ లో పనిచేసిన లంబాడీ కార్యకర్తలను గౌరవించకుండా అవమానించడమే కొనసాగుతోందన్నారు. లంబాడీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా తండాల్లో సేవాలాల్ సేన ప్రచారం నిర్వహించి, రాబోయే స్థానిక ఎన్నికల్లో లంబాడీల ఓట్లతో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. హైదరాబాద్లో సేవాలాల్ సేన రాష్ట్ర, అనుబంధ కమిటీలు సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లకావత్ స్వరాజ్ నాయక్ ,జిల్లా అధ్యక్షులు శివ నాయక్,కృష్ణా నాయక్, పాల్వంచ మండల అధ్యక్షులు జర్పుల పరమేష్ నాయక్, గణేష్ మహారాజ్, బట్టు హుస్సేన్ నాయక్, సురేష్ నాయక్, కుమార్ నాయక్ నాగేష్ నాయక్, రాందాస్ నాయక్, చందు నాయక్, దేవ్ సింగ్ నాయక్, గుగులోత్ చందర్ నాయక్, లచ్చు నాయక్ ,మూడు రత్నం నాయక్ , కృష్ణ నాయక్, అంగోత్ సురేష్ నాయక్, , గణేష్ మహారాజ్, బానోత్ కుమార్ నాయక్, భూక్యా ప్రసాద్, గుగులోత్ రాంబాబు నాయక్, భూక్యా సురేష్ నాయక్, తేజవత్ ప్రేమకుమార్, బానోత్ ప్రతాప్ నాయక్, నూనావత్ రాజా, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డి ని కలిసిన ఎమ్మెల్యే



**ఇల్లందు, జులై 29, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని మంగళవారం హైదరాబాద్ లో ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు, అమలైన సంక్షేమ పథకాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఎస్టి నియోజకవర్గమైన ఇల్లందుకు అదనంగా అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోరం సురేందర్, మండల రాము, ఈది గణేష్, సర్దార్, బోగ నందకిషోర్, ఫతే మహమ్మద్, తోటకూరి శివయ్య పాల్గొన్నారు.

## స్వల్పంగా పెరిగి తగ్గిన గోదావరి

**భద్రాచలం, జూలై 29,ప్రజాజ్యోతి :** భద్రాచలం వద్ద మంగళవారం గోదావరి స్వల్పంగా పెరిగి తగ్గుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటలకు 35.70 అడుగులున్న గోదావరి ఆనంతరం 6.30కి 36.30 అడుగులకు, రాత్రి 9 గంటలకు 36.50, మంగళవారం నుంచి నిలకడగా ఉన్న గోదావరి ఉదయం 11 గంటలకు మళ్లీ 35 అడుగులకు తగ్గింది. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు 35.50 ఆడుగులకు చేరుకుంది. సాయంత్రం 5 గంటల వరకు సైతం నిలకడగానే ఉంది.

## అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా కమిటీలో ముగ్గురికి చోటు.

**టేకులపల్లి, జూలై 29, ప్రజాజ్యోతి:** పాల్వంచ ఆత్మలింగేశ్వర స్వామి




దేవాలయంలో మంగళవారం జరిగిన "నీ గానమే నా ప్రాణం"52వ వేదిక కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్యాత్మిక నూతన కమిటీని జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్ దేశ్ పాండే ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక కమిటీలో టేకులపల్లి మండలం నుంచి ముగ్గురికి చోటు కల్పించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా అనుగోజు నటరాజ్ (బేతంపూడి),గౌరవ సలహాదారులుగా గుడిపూడి మోహన్ రావు, సహాయ కార్యదర్శిగా గుండా నరసింహ రావు (టేకులపల్లి) నుండి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వీరి పదవీకాలం రెండు సంవత్సరాల పాటు ఉంటుంది. హిందూ భావజాలాన్ని ప్రచారం చేయడంలో, హిందూ ఆధ్యాత్మిక చింతన పెంపొందించే కార్యక్రమాలను పాటిస్తూ, సనాతన హైందవ ధర్మం కాపాడటంలో కృషిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్ దేశ్ పాండే,అన్నదాన కమిటీ జాతీయ అధ్యక్షులు తాంద్ర రాంప్రసాద్, అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ గుత్తా చంద్రశేఖర్ , ప్రముఖ గాయకులు కేశవ్ గురుస్వామి పాల్గొన్నారు.